# తిథి

"అయ్యా! వచ్చే మే 28 మంగళ వారం పౌర్ణమి. అనూరాధా నక్షత్రం. మీ తండ్రిగారి తిథి ఆ వేళేను. మీకో మాటు జ్ఞాపకం చేయడానికి వచ్చాను" అన్నారు మా పురోహితులు.

మా తండ్రిగారు కాలం చేసి మూడేళ్లయింది. ఆయన తిథి ఎప్పుడు వచ్చేదీ వారం రోజులు ముందుగా మా పురోహితులు తెలియజేస్తుంటారు. లేకపోతే అర్జంటుగా ఆఫీసు పని మీద నేను గ్రామాంతరం వెళ్లితే మరచిపోవచ్చు.

ఒక వేళ వెళితే ఆ పితృకార్యం నాటికి ఇల్లు చేరుకోవచ్చు.

"ఆ ఆ థాంక్స్. బాగా జ్ఞాపకం చేశారు. వచ్చే మంగళవారం నాడు పొద్దున్నే వచ్చేయండి" అన్నాను. అనుకున్నట్టే మా పురోహితులు పితృకార్యం నాటి పొద్దున్నే ఏడోగంటకల్లా వచ్చారు. "అయ్యా! పురోహితులు గారూ! ఈ రోజు నేను పితృకార్యం జరపదలచుకోలేదండీ! మీరు క్షమించాలి" అన్నాను.

"అదేమిటండీ బాబూ! పితృకార్యం జరపననకూడదు. మహాపచారం! మీ పితృపాదుల ఆత్మ పితృలోకాల్లో అశాంతి తో వుంటుంది. ఆయనకు మంచి జన్మరాదు!" అన్నారు పురోహితులు.

"చూడండీ! పితృకార్యం ఎవరికి జరుపుతారు చెప్పండీ?" అడిగాన్నేను.

"నిస్సందేహంగా చనిపోయిన వారికే! అదేం అలా అడుగుతున్నారు?"

"మరి మా నాన్నగారు బతికే వున్నట్టు ఋజువైందే?"

"మూడేళ్ల కిందటే కాలంచేసిన మీ నాన్నగారు బతికే వున్నారా? ఇదేదో సినిమా కథలా వుందే?" చోద్యపడ్డారు పురోహితులు.

"ఇటీవల తే.20.5.91దీన పోలింగ్ నాడు రాజ్యాంగం నాకు ప్రసాదించిన అతి పవిత్రమైన వోటు హక్కుని వినియోగించికుందామని వెళ్లాను. వోటర్ల జాబితాలో మా నాన్నగారి పేరు, తరువాత నా పేరుంది. మూడేళ్ల కిందట కాలం చేసిన మా నాన్నగారి పేరు వోటర్ల జాబితాలో తీసేసి వుండాలా? లేదు! పైగా వోటు వేసినట్టు అండర్ లైన్ చేసి వుంది! అంటే ఎవరో వచ్చి మా నాన్నగారి వోటుని వేసేశారన్న మాట. అంచేత మా నాన్నగారు బతికి వున్నట్టేకదా?

అందుకే ఈ ఏడాది మా నాన్నగారి శ్రాద్ధదినం రద్దు చేసేస్తున్నాను!"

21-12-1991

ఆంధ్రభూమి దినపత్రిక